
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 12 । ఆగస్టు । 2025



సోమశిలలో 39.964 టీఎంసీలు

జలాశయంలో సోమవారానికి 39.964 టీఎంసీలు ఉన్నాయి. 15,687 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. పవర్‌టన్నెల్‌కు 1850, ఉత్తర, దక్షిణ కాలువలకు 6,540 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,03,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.9,339
3 శాతం జీఎస్టీతో	రూ.9,619
నవర (8 గ్రా)	రూ.76,952

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.7 /26.4

జిల్లాలో మంగళవారం అక్కడక్కడ మోస్తరుగా వర్షాలు కురిసే వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. సోమవారం గాలిలో తేమ 58 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

మద్యం కేసులో కాకాణికి బెయిల్ మంజూరు




నెల్లూరు (లీగల్): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిపై ఇందుకూరుపేట ఎక్సైజ్ అధికారులు నమోదు చేసిన అక్రమ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ నెల్లూరు 4వ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ నిషాద్ నాజ్ షేక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు ఒక్కొక్కరు రూ.25 వేలు ఆస్తి విలువ కలిగిన ఇద్దరు జామీన్‌దారుల పూచీకత్తు, రూ.25 వేలు, వ్యక్తిగత బాండ్ సమర్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్సైజ్ అధికారుల విచారణకు కాకాణి సహకరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేసులో కాకాణి తరఫున సీనియర్ న్యాయవాదులు రామిరెడ్డి రోజారెడ్డి, పి.ఉమామహేశ్వర్‌రెడ్డి, ఎంవీ విజయకుమారి, సిద్ధన సుబ్బారెడ్డి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కాకాణిపై ఆరోపణలకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని, కేవలం రాజకీయ కక్షతో 8వ నిందితుడిగా కేసు బనాయించారని వాదనలు వినిపించారు. అనంతరం ఇందుకూరుపేట ఎక్సైజ్ అధికారుల తరఫున ఏపీపీ లీలాకుమారి వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు.

రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ బదిలీ

నెల్లూరు (లీగల్): నెల్లూరు రైల్వే కోర్టు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పాలమంగళం వినోద్‌ను కర్నూలు జిల్లా డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తు తం నెల్లూరు రైల్వే కోర్టు మేజిస్ట్రేట్ వినోద్ ఏపీ జ్యుడీషియల్ అకాడమీలో ట్రైనింగ్‌లో ఉన్నా రు. ట్రైనింగ్ తర్వాత డోన్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు తీసుకొంటారు.

పోలీస్ కస్టడీకి బిరదవోలు

నెల్లూరు (లీగల్): వైఎస్సార్‌సీపీ నేత బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని విచారణ నిమిత్తం మూడు రోజులు పోలీస్ కస్టడీకి ఇస్తూ నెల్లూరు 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎస్.సరస్వతి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరు మండలం తాటిపర్తిలో అక్రమ మైనింగ్ చేసినట్లు పొదలకూరు పోలీసులు నమోదు చేసిన కేసులో ఆయన్ను విచారించడానికి నెల్లూరు రూరల్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి ఈ కేసులో 12వ నిందితుడిగా ఉన్నారని విచారించడానికి 7 రోజులు కస్టడీ అవసరం ఉందన్నారు. బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది కె.రాజశేఖర్ వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాంత్‌రెడ్డిని ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటలకు విచారణ నిమిత్తం నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి తీసుకోవాలని, 14వ తేదీ విచారణాంతరం సాయంత్రం ఐదు గంటలకు వైద్య పరీక్షలు చేయించి కోర్టులో హాజరుపరిచాలన్నారు. విచారణ సమయంలో థర్డ్ డిగ్రీ ఉపయోగించొద్దని, న్యాయవాది సమక్షంలో ఆయన్ను విచారణ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



కార్పొరేట్ విద్యా సంస్థల ధనదాహానికి విద్యార్థుల బలిదానాలు హృదయాలను కలచివేస్తున్నాయి. మార్కులు, ర్యాంక్‌ల పేరుతో సరస్వతీ పుత్రులను చిదిమేస్తున్నారు. బిడ్డల భవిష్యత్తే తమ జీవితాశయమని తల్లిదండ్రులు తినీతినక కడుపులు మాడ్చుకుని, రెక్కలు ముక్కలు చేసుకుని రూ.లక్షలు తెచ్చి కార్పొరేట్ చేతుల్లో పోస్తున్నారు. బిడ్డలను చదివించమని వదిలి పెడితే.. చావును చూపించి శవాలను తిరిగి పంపిస్తున్నారు. కన్నవారికి కడుపు కోత మిగుల్చుతున్నారు. వేళకు పిడికెడు నాణ్యమైన మెతుకులు కూడా పెట్టకుండా మానవత్వం మరిచి మారీచుడిల్లా వ్యవహరిస్తున్నారు. అనధికారికంగా పాఠశాలలు, కళాశాలలు నిర్వహిస్తున్న యాజమాన్యాల నుంచి అధికారులు మామూళ్లు దండుకుంటున్న విషయం జగద్విదితమే. అనుమతుల్లేకుండా హాస్టళ్లు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలు తీస్తున్న ఘటనలు జరుగుతున్నప్పుడైనా స్పందించాల్సిన విద్యాశాఖ అధికారులు ఏ కోశాన దయ, మానవత్వం లేకుండా తమకేమి సంబంధం లేదంటూ తప్పుకుంటున్నారు.

చదివిస్తున్నారనుకుంటే.. చావు చూపిస్తున్నారు

40 రోజుల్లో ముగ్గురు విద్యార్థుల ఆత్మహత్య



నగరంలోని అన్నమయ్య సర్కిల్ సమీపంలో ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ నిర్వహిస్తోంది. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాచపాళేనికి చెందిన హేమశ్రీ పదో తరగతిలో మంచి మార్కులు సాధించడంతో తమ కళాశాలలో చేర్పించమని ఆ విద్యార్థిని తల్లిదండ్రులపై ఒత్తిడి చేసి ఇంటర్‌లో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో జాయిన్ చేసుకున్నారు. ఈ కళాశాల హాస్టల్‌లో ఉంచి చదివిస్తున్నారు. బాగా చదువుకునే విద్యార్థిని ఇంకా బాగా చదవాలంటూ ఒత్తిడి చేయడంతో తట్టుకోలేక సెక్షన్ మార్చాలని యాజమాన్యానికి విన్నవించుకుంది. తల్లిదండ్రులు కూడా తమ కుమార్తె సెక్షన్ మార్చాలని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో ఒత్తిడిని తట్టుకోలేని హేమశ్రీ అనుమానాస్పద స్థితిలో ఆదివారం తనవు చాలించింది. ఇలా యాజమాన్యాల నిర్వాహకం, ఒత్తిళ్లు తట్టుకోలేక జిల్లాలో కేవలం 40 రోజుల వ్యవధిలోనే ముగ్గురు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారు.

- జిల్లాలో 30కు పైగా జూనియర్ కళాశాలల హాస్టల్స్
- ఒక్క దానికి కూడా అనుమతి లేదు
- రూ.లక్షల్లో ఫీజులు.. దారుణ వసతులు
- ర్యాంకుల పేరుతో తీవ్రస్థాయిలో ఒత్తిడి
- తట్టుకోలేక బలవన్మరణాలు

నెల్లూరు (టౌన్): జిల్లాలో ఉన్న 137 కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ జూనియర్ కళాశాలల్లో సుమారు 40 వేల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. ఆయా కళాశాలలకు సంబంధించి 30 వరకు అనధికార హాస్టల్స్ నిర్వహిస్తున్నారు. ఈ హాస్టల్స్‌ల్లో 15 వేల మందికి పైగా విద్యార్థినీ, విద్యార్థులు ఉంటున్నారు. వీటిల్లో రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణకు చెందిన 10 హాస్టళ్లు ఉన్నాయి. ఇంటర్‌లో అకడమిక్, హాస్టల్‌కు



విద్యార్థిని హేమశ్రీ మృతి చెందిన ఆర్ఎస్ఆర్ కళాశాల ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాలు (ఫైల్)

కలిపి కళాశాలను బట్టి రూ.60 వేల నుంచి రూ.2.70 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారు. ఇవికాకుండా పరీక్ష ఫీజు, హాస్టల్ డిపాజిట్, ప్రాక్టికల్స్, గేమ్స్ తదితర పేర్లతో మరో రూ.5 వేల నుంచి రూ.7 వేలు అదనంగా వసూలు చేస్తున్నారు. ఆదర్శంగా ఉండాల్సిన మంత్రి నారాయణ తమకు చెందిన విద్యా సంస్థలు, హాస్టల్స్‌ల్లోనే నాసిరకమైన భోజనం, వసతుల లేమి, ఒత్తిడితో కూడిన చదువులు ఉండడంతో ఎంతో మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఆశలు సమాధి చేసి.. ప్రాణాలు తీసి..

పేదింటి తల్లిదండ్రుల నుంచి శ్రీమంతుల వరకు తమ బిడ్డల భవిష్యత్‌పై ఎన్నెన్నో ఆశలు పెట్టుకుంటున్నారు. పేదింటి కుటుంబాలు అయితే తమ స్థోమతకు సరిపోకపోయినా.. కూలినాలీ చేసి, ఒక పూట తిని, మరో పూట పస్తులుండి, అప్పులు చేసి మరీ బిడ్డలను కార్పొరేట్ విద్యా సంస్థల్లో చేర్పిస్తున్నారు. ధనదాహంతో మునిగిపోయిన యాజమాన్యాలు విద్యార్థులపై మార్కులు, ర్యాంక్‌ల పేరుతో తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు పెంచుతున్నారు. కష్టమని చెప్పినా.. నిర్బంధంగా చదవాల్సిందే అంటూ పెంచుతున్న ఒత్తిడికి తట్టుకోలేక తనువులు చాలించే పరిస్థితిలోకి జారిపోతున్నారు. ఘటన జరిగిన తర్వాతైనా ఆయా తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తారా అంటూ అదీ ఉండడం లేదు. బిడ్డ చనిపోతే.. అనారోగ్యంతో ఆస్పత్రిలో చేర్పించాంటూ చేతులు దులుపుకుంటున్నారు. కనీసం సమాచారం చెప్పే దిక్కుకూడా లేకుండా తాళాలు వేసి వెళ్లిపోతున్నారు.

అనుమతి లేకుండానే నిర్వహణ

జిల్లాలో జూనియర్ కళాశాలల పేరిట నిర్వహిస్తున్న ఏ హాస్టల్‌కు ప్రభుత్వ అనుమతి లేదు. కొన్ని యాజమాన్యాలు ఒకే భవనంలో కళాశాల, హాస్టల్ నిర్వహిస్తుండగా, మరికొన్ని యాజమాన్యాలు కళాశాల ఒకచోట, హాస్టల్ మరొక చోట నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. ఏ ఒక్క హాస్టల్‌కు ఫైర్ సర్టిఫికెట్ లేదు. ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే ప్రాణాలు వదలాల్సిన భయానక పరిస్థితి ఉంది. హాస్టల్స్‌ల్లో వసతులు అధ్వానంగా ఉంటున్నాయి. కారాగారాలను తలపించే విధంగా భవనాలు, ఇరుకు గదుల్లో ఐదుగురు నుంచి ఏడుగురు విద్యార్థులను ఉంచుతున్నారు. హాస్టల్ పేరుతో రూ.లక్షలు గుంజుతున్నా నాణ్యమైన భోజనం పెట్టడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ర్యాంకులు పేరుతో ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు తరగతులు, స్టడీ అవర్స్ పేరుతో విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తున్నారు. విద్యార్థులు చదవలేమని చెప్పినా ఆయా యాజమాన్యాలు బలవంతంగా వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. భోజనం బాగాలేదని, హాస్టల్స్‌ల్లో మరుగుదొడ్లు, ఇరుకు గదుల్లో మేం పడుకోలేకున్నామని తల్లిదండ్రులకు చెప్పినా ఏదో రకంగా సర్దుకుపోమ్మని సలహా ఇస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికారులు

గడిచిన 40 రోజుల వ్యవధిలో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినా జిల్లా ఇంటర్ బోర్డు, ఉన్నతాధికారుల్లో చలనం లేదు. కనీసం అటు వైపు వెళ్లి తనిఖీ చేసిన సందర్భాలు లేవు. కార్పొరేట్ కళాశాలల్లో వసతులు, విద్యార్థులపై ఒత్తిడి, నాసిరకం భోజనంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నా, కార్పొరేట్ యాజమాన్యాల నుంచి రూ.లక్షల్లో మామూళ్లు తీసుకుంటున్న ఇంటర్ బోర్డు అధికారులు కళాశాలలు, హాస్టల్స్ వైపు కన్నెత్తి చూడటం లేదని మండి పడుతున్నారు. విద్యార్థుల ఆత్మహత్యలపై కనీసం జిల్లా అధికారి నుంచి కూడా స్పందన రాకపోవడంతో విద్యావేత్తలు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటర్‌బోర్డు అధికారులు మామూళ్ల మత్తులో తూలుతుండగా మరో వైపు కార్పొరేట్ యాజమాన్యాలు ధన దాహంతో చెలరేగి పోతున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ ఆనంద్ స్పందించి అనుమతి లేని హాస్టల్స్, కళాశాలలను తనిఖీ చేసి వాటిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతోపాటు కళాశాల గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

- బీసీ విద్యార్థి సంఘం

నెల్లూరు (అర్బన్) : నగరంలోని ఆర్ఎస్ఆర్ కళాశాల విద్యార్థిని హేమశ్రీ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ చేపట్టడంతోపాటు అందుకు కారణమైన కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జేసీ కార్తీక్‌కకు ఆ సంఘ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్, జిల్లా అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ మెంబర్ మురళీకృష్ణయాదవ్ మాట్లాడుతూ విద్యార్థిని అనుమానాస్పద మృతిపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఉదయం 8.30 గంటలకు తల్లిదండ్రులకు హేమశ్రీ ఫోన్ చేసి ఇక్కడ చాలా ఇబ్బందిగా ఉంది, చదువుల్లో నన్ను ఇబ్బంది పెడుతున్నారంటూ ఫోన్ చేసిందన్నారు. ఆ తర్వాత అర్ధగంటలోపే విద్యార్థిని మృతి చెందడం వెనుక ఉన్న ఒత్తిడి, ఇబ్బందులపై



జేసీకి వినతి పత్రం ఇచ్చి మాట్లాడుతున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

విచారణ జరిపించాలన్నారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమైన 3 నెలల్లోనే నెల్లూరులోని వివిధ కార్పొరేట్ కళాశాలల్లో నలుగురు విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇందుకు కారణమైన వారిని శిక్షించాలన్నారు. ఇలాంటి ఘటనలు మరలా జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు విజయ్, బాలాజీ, సుధీర్‌యాదవ్, నాయబ్‌లు పాల్గొన్నారు.

హాస్టల్స్‌ను పర్యవేక్షించే అధికారం లేదు

ఇంటర్ జూనియర్ కళాశాలలకు సంబంధించి నిర్వహిస్తున్న హాస్టల్స్‌ను పర్యవేక్షించే అధికారాలు మాకు లేవు. విద్యార్థిని ఆత్మహత్యపై ఆర్ఎస్ఆర్ జూనియర్ కళాశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశాం. ఆ కళాశాలకు తనిఖీకి వెళ్లితే తాళం వేసి ఉంది. విద్యార్థిని ఆత్మహత్యపై విచారించి కళాశాల యాజమాన్యమే కారణమని తేలితే తప్పకుండా చర్యలు తీసుకుంటాం. అన్ని కళాశాలలను తనిఖీ చేస్తాం. అనుమతి లేని వాటిని సీజ్ చేసి చర్యలు చేపడతాం.

– వరప్రసాదరావు, ఆర్ఐఓ

యాజమాన్యాలపై కేసు నమోదు చేయాలి

రాష్ట్రంలో అనుమతి లేకుండా హాస్టల్స్‌ను నిర్వహిస్తున్న కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. వాటిని వెంటనే సీజ్ చేయాలి. విద్యార్థుల ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి కారణమైన కళాశాల గుర్తింపు రద్దు చేయాలి. కళాశాల, హాస్టల్స్ నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ విచారణకు ఆదేశాలు జారీ చేయాలి. విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– నరహరి, రాష్ట్ర అధ్యక్షుడు, పేరెంట్స్ అసోసియేషన్

ఉచిత బస్సు 'కొందరికే'

- ➡ నెల్లూరు ఒంగోలు మధ్య ఎక్స్‌ప్రెస్‌లు లేవు. అన్నీ డీలక్స్, సూపర్ డీలక్స్ బస్సులే. ఉన్న ఎక్స్‌ప్రెస్‌లు కావలి–నెల్లూరు మధ్య తిరిగే నాన్‌స్టాప్ బస్సులే. వీటిల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి లేదు. మహిళలు ఎవరైనా ఒంగోలుకు వెళ్లాంటే పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులో కావలి వరకు వెళ్లి.. అక్కడి నుంచి మరో బస్సులో ఒంగోలుకు వెళ్లాల్సి ఉంటుంది. నెల్లూరు నుంచి కందుకూరు వెళ్లాలన్నా.. ఇదే పరిస్థితి.
- ➡ నెల్లూరు నుంచి గూడూరుకైనా పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. నాయుడుపేట, సూళ్లూరుపేటకు వెళ్లాంటే నేరుగా ఆర్డినరీ బస్సులు కూడా లేవు. కనీసం గూడూరు నుంచి కూడా ఆర్డినరీలు లేవు.

- పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లోనే అవకాశం
- నాన్‌స్టాప్‌ల్లో ఉచిత ప్రయాణం లేదంట
- మరో మూడు రోజులే ఉన్నా.. ఇంకా అందని మార్గదర్శకాలు
- మల్లగుల్లాలు పడుతున్న ఆర్టీసీ అధికారులు

నెల్లూరు సిటీ: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించనున్న పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌ల్లో మహిళలకు ఉచిత ప్రయాణం 'కొందరికే' ఉపయోగపడుతోంది. ఎక్స్‌ప్రెస్‌ల్లో ఉచితం అంటూనే నాన్‌స్టాప్‌గా నడిచే ఎక్స్‌ప్రెస్‌ల్లో 'నో ఫ్రీ' అంటూ కొర్రీలు పెట్టింది. ప్రస్తుతానికి నిబంధనలు ఇవే ఉన్నప్పటికీ.. ప్రారంభించే సమయానికి ఇంకెన్ని కండీషన్లు ఉంటాయోనని చర్చ ఆర్టీసీ అధికారులు, ఉద్యోగుల్లోనూ ఉంది. మరో మూడు రోజుల్లో ఉచిత బస్సును ప్రారంభించాల్సి ఉన్నా.. ఇంతవరకు అధికారులకు మార్గదర్శకాలు రాలేదు.

70 శాతం బస్సుల్లో అనుమతి ఉన్నా..

జిల్లాలో నెల్లూరు-1, నెల్లూరు-2, ఆత్మకూరు, కందుకూరు, కావలి, రాపూరు, ఉదయగిరిలో మొత్తం 7 డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల్లో 642 బస్సులు



బస్సులో ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు

వివిధ మార్గాల్లో నడుస్తున్నాయి. అయితే ఇందులో 341 పల్లెవెలుగు, 31 అల్ట్రా పల్లెవెలుగు, 52 ఎక్స్‌ప్రెస్‌లు కలిపి 424 (70 శాతం) బస్సుల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు చెబుతున్నప్పటికీ ఎక్స్‌ప్రెస్ కేటగిరీల్లోని నాన్‌స్టాప్ బస్సుల్లో అనుమతి లేకపోవడం వల్ల పెద్దగా ఒరిగేమీ ఉండదు. పట్టణాల నుంచి పల్లెలకు ఉండేవి, నడిచేవి పల్లె వెలుగులు మాత్రమే. ప్రధానంగా నెల్లూరు నుంచి కావలి, గూడూరు, ఆత్మకూరు మార్గాల్లో పల్లె వెలుగుతోపాటు అల్ట్రా పల్లెవెలుగు బస్సులు ఉన్నాయి. ఎక్కువగా ప్రయాణికులు నాన్‌స్టాప్ బస్సులనే ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం ఈ ఉచిత ప్రయాణం అందరికీ ఉపయోగపడే పరిస్థితి లేదని స్పష్టమవుతోంది.

అదనంగా 30 బస్సుల కేటాయింపు

ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు 30 బస్సులను మాత్రమే అదనంగా కేటాయించారు. ఐడి బస్సులు 25, మరో 5 బస్సులను కేటాయించారు. గత ఆరు నెలల నుంచి ఆర్టీసీ అధికారుల నుంచి ప్రభుత్వం దఫాల వారీగా జిల్లాలో ఎన్ని బస్సులు అవసరం? ఎంత మంది డ్రైవర్‌లు, కండెక్టర్లు అవసరమో అడుగుతూ వచ్చింది. దీంతో అధికారులు సూచించిన మేరకు బస్సులు కేటాయింపు జరగకపోవడంతో ఫ్రీ బస్సు సర్వీసులను ఎలా నిర్వహించాలో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

డొక్కు బస్సుల్లోనే ప్రయాణం

ప్రతి రోజూ జిల్లాలో బస్సుల్లో 1.50 లక్షల నుంచి 1.70 లక్షలు మందికిపైగా ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. మహిళలు 70 వేల నుంచి 80 వేలు వరకు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. అయితే ప్రస్తుతం జిల్లాలో ఉన్న 642 బస్సుల్లో 15 లక్షల కి.మీ. తిరిగిన బస్సులు 100 ఉండగా, 10 లక్షలు కి.మీ. తిరిగిన బస్సులు 200 వరకు ఉన్నాయి. కొత్త బస్సులు 100 ఉండగా, 200 బస్సులు కండీషన్‌లో ఉన్నాయి. కండీషన్‌లో లేని బస్సుల్లో ఎక్కువ శాతం పల్లెవెలుగు బస్సులు కావడం గమనార్హం. ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసిన తరువాత ఎక్కువ మంది మహిళా ప్రయాణికులు పెరిగే అవకాశం ఉంది. అయితే ఆ బస్సుల్లో లోడ్ పెరగడం ద్వారా బస్సుల పరిస్థితి అంతంత మాత్రంగా ఉండడంతో ప్రయాణం సజావుగా సాగేనా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మూలన పడేందుకు సిద్ధంగా ఉన్న బస్సులకు రంగులు అద్ది రోడ్ల పైకి తీసుకు వస్తున్నారు.

విద్యార్థులు, ఉద్యోగులకు తిప్పలు తప్పవా?

ప్రతి రోజూ ఉదయాన్నే విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లేందుకు, ఉద్యోగులు కార్యాలయాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఆశ్రయిస్తుంటారు. అయితే మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో ఒక్కసారిగా మహిళలు అధికంగా ఎక్కితే ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులు, ఉద్యోగులకు సీట్లు దొరికే పరిస్థితి ఉండదు. దీంతో అధికారులు ఏమి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంటుంది.

100 మంది ఆన్‌కాల్ డ్రైవర్ల నియామకం

జిల్లాలో డ్రైవర్లు 1,119, కండక్టర్లు 923 మంది ఉన్నారు. వీరు కాకుండా 110 మంది ఆన్‌కాల్ డ్రైవర్స్ ఉన్నారు. అయితే కొత్తగా మరో 100 మంది ఆన్‌కాల్ డ్రైవర్స్‌ను అధికారులు నియామకం చేసుకుంటున్నారు. అయితే ఆన్‌కాల్ డ్రైవర్స్ నియమించుకునే క్రమంలో వారి పూర్తిస్థాయి డ్రైవింగ్‌పై అనుభవాన్ని పరీక్షిస్తున్నారు. గతంలో లారీలు, ప్రైవేట్ బస్సులు, భారీ వాహనాలు నడిపిన అనుభవం ఉంది. అయితే ఆయా డ్రైవర్లు వందల మంది ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వాహనాలు నడుపుతారా అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. పాత, తుప్పు పట్టిన బస్సులకు పసుపు రంగులు వేసి కలరింగ్ చేస్తున్నారు.

బస్సులను కండీషన్‌లో ఉంచుతాం

ఈ నెల 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. బస్సులను కండీషన్‌లోఉండేలా చూసుకుంటున్నాం. ఇంకా ఉచిత ప్రయాణానికి సంబంధించి మార్గదర్శకాలు అందలేదు. వచ్చిన వెంటనే కార్యాచరణ చేపడుతాం.

– షేక్ షమీమ్, జిల్లా ప్రజా రవాణాశాఖ అధికారి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో కార్మిక సంఘం నాయకులు

వాహనమిత్ర అమలు చేయాలి

- మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతాం
- జీఓ నంబర్ 21 పేరుతో పన్నులు, జరిమానాల భారం
- కలెక్టరేట్ ఎదుట కదం తొక్కిన ఆటో డ్రైవర్లు

నెల్లూరు రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన వాహన మిత్ర పథకాన్ని లైసెన్సు కలిగిన ప్రతి డ్రైవర్‌కు అమలు చేయాలని ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఆటోడ్రైవర్లకు గత ప్రభుత్వం కంటే మిన్నగా ఇస్తామని కూటమి పెద్దలు హామీలిచ్చారన్నారు. ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. సోమవారం భారీగా తరలివచ్చిన ఆటోడ్రైవర్లు కలెక్టరేట్ ఎదుట కదం తొక్కారు. మహిళలకు ఉచిత బస్సు పథకంతో ఉపాధి కోల్పోతున్నామంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే జీఓ నంబరు 21 పేరుతో ట్యాక్స్‌లు, జరిమానాలు భారీగా పెంచడంతో ఆర్థికంగా తమపై భారం పడుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం నెల్లూరు జిల్లా ఆటోకార్మిక సంఘం ఆధ్వర్యంలో వీఆర్ కాలేజీ గ్రౌండ్ నుంచి 500 మంది ఆటో డ్రైవర్లు కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించి, ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టీవీవీ ప్రసాద్, ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఓ సురేష్, రాజా మాట్లాడుతూ ఇప్పటికే ఆర్థిక భారాలతో సతమతమవుతున్న ఆటో కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఉచిత బస్సు నిర్ణయంతో జీవితాలు మరింత దుర్భరంగా మారే పరిస్థితి అనివార్యమవుతుందన్నారు. గత ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏటా రూ.10 వేల వాహనమిత్ర పథకం ద్వారా సాయాన్ని అందించిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండో సంవత్సరం గడుస్తున్నా.. ఆటోకార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇచ్చే విధానాన్ని ప్రైవేట్ ఏజెన్సీకి ఇవ్వకుండా ఆపాలని ఆర్టీఏ అధికారుల ద్వారానే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. పెనాల్టీలు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు తగ్గించాలన్నారు. బ్యాంకు నుంచి వాహనాల కొనుగోలుకు రూ.4 లక్షల రుణాన్ని సబ్సిడీతో కూడిన వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలన్నారు. మండలాల్లో ఆటో పార్కింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు స్వర్ణా బాబురావు డి లవన్‌కుమార్, సున్న సురేష్ రాధయ్య, పెంచలయ్య, రవీంద్ర శ్యాంసన్, ఎం.సుధాకర్ విజయ్, హరి, దయాసాగర్, అశోక్, జిల్లా నలుమూలల నుంచి 500 మంది ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖ వినతులే అధికం

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- 411 వినతుల అందజేత


జేసీ కార్తీక్‌కు వినతిపత్రం అందజేస్తున్న నెల్లూరు క్రైస్తవ సమాఖ్య వేదిక నాయకులు

నెల్లూరు రూరల్: ప్రతి వారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ శాఖకు సంబంధించిన వినతులే అధికంగా వస్తున్నాయి. ఈ సోమవారం జేసీ కె.కార్తీక్ తదితరులు ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. మొత్తం 411 వినతులందాయి. రెవెన్యూ శాఖవి 141, పోలీస్ శాఖవి 62, మున్సిపల్ శాఖవి 40, సర్వేవి 30, పంచాయతీరాజ్ శాఖవి 38 తదితరాలున్నాయి. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు వినతులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో హుస్సేన్ సాహెబ్, డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి, హౌసింగ్ పీడీ వేణుగోపాల్, డీఎంహెచ్‌ఓ సుజాత, హార్టికల్చర్ ఏడీ సుబ్బారెడ్డి, విద్యుత్ ఎస్‌ఈ విజయన్ తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని, పాస్టర్లపై దాడులు, అక్రమ కేసులను అరికట్టాలంటూ కలెక్టర్ కార్యాలయం వద్ద నెల్లూరు క్రైస్తవ సమాఖ్య వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బిషప్ డాక్టర్ ఎండీ ప్రకాశం మాట్లాడుతూ అనేక పోరాటాల తర్వాత సిక్కులకు, బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించి దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఇంత కాలమైనా నిరాకరించడం ప్రాథమిక హక్కులకు విరుద్ధమన్నారు. దళిత క్రైస్తవ మహాసభ అధ్యక్షుడు డాక్టర్ ఎలీషాకుమార్ కలివెల మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పాస్టర్లు, సిస్టర్లపై, చర్చిలపై దాడులను, అక్రమ కేసులు బనాయించడాన్ని అరికట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం జేసీకి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో డేనియల్, బెనహర్ బాబు, డేవిడ్, దయాసాగర్, క్రాంతి కుమార్, ప్రభుకుమార్, రాజశేఖర్, హృదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ కోసం..

సూపర్‌సిక్స్ పథకాలను మంజూరు చేయాలని జిల్లా అంధుల సమాఖ్య అధ్యక్షుడు ఎస్‌కే జకావుల్లా, ఉపాధ్యక్షుడు దుర్గాబాబు, షేక్ మస్తాన్, ఎస్‌కే సనావుల్లా, ఎస్‌కే జిలానీ తదితరులు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయాలన్నారు. దివ్యాంగులందరికీ ఇండిపెండెంట్ రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలన్నారు. శాశ్వత ఉపాధి కల్పించాలన్నారు. గృహాలను ప్రభుత్వం నిర్మించాలన్నారు.


సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న జిల్లా అంధుల సమాఖ్య సభ్యులు

అక్రమ మైనింగ్‌పై చర్యలకు డిమాండ్

సైదాపురం, గూడూరుల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్ నిర్వహించే యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ, అక్రమ మైనింగ్ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు ఎం.రాజేష్ కుమార్ వినతిపత్రం అందజేశారు. సైదాపురంలోని కేఎస్ఆర్, సిద్ధి వినాయక, షిర్డీ సాయి, శోభారాణి, వెంకటకనకదుర్గ, ఉమామహేశ్వర మైకా మైన్స్‌లో అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. అధికారులు తనిఖీలు చేసి నోటీసులిచ్చినా మాఫియా లెక్కచేయడం లేదన్నారు. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నట్లు చెప్పారు. సమితి గౌరవాధ్యక్షుడు పి.శ్రీనివాసులురెడ్డి, ప్రధాన కార్యదర్శి వంశీకృష్ణ, శివకుమార్, పాల్‌రాజ్, షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రమిస్తున్న రాజేష్ కుమార్

ప్రేమ పేరుతో మోసం


మహిళ సమస్యను తెలుసుకుంటున్న ఏఎస్పీ సౌజన్య

- న్యాయం చేయాలని పోలీసులకు వినతులు
- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 98 ఫిర్యాదులు
- చట్ట పరిధిలో విచారిస్తామన్న ఏఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైమ్): 'నంద్యాలకు చెందిన కె.రమేష్ ప్రేమ పేరుతో మోసం చేశాడు. పెళ్లి చేసుకోవాలని అడుగుతుండగా మొహం చాటేసి మరో యువతిని వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. అతడిపై చర్యలు తీసుకోవాలి' అని కొడవలూరుకు చెందిన ఓ యువతి కోరారు. 'వింజమూరు ప్రాంతానికి చెందిన బాబు ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. ఇద్దరం కలిసి సహజీవనం చేశాం. పెళ్లి చేసుకోవాలని అడిగితే నిరాకరిస్తున్నాడు' అని ఉదయగిరికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి 98 మంది విచ్చేసి తమ ఫిర్యాదులను ఏఎస్పీ సీహెచ్ సౌజన్యకు అందజేశారు. వాటిని పరిశీలించిన ఆమె ఆయా ప్రాంత పోలీసు అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ మిద్దె నాగేశ్వరమ్మ, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- కువైట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని అనంతసాగరానికి చెందిన తులసీధర్ నమ్మించాడు. రూ.3 లక్షల నగదు తీసుకుని కువైట్‌కు తీసుకెళ్లి ఉద్యోగం ఇప్పించలేదు. నగదు తిరిగివ్వలేదు. ఇటీవల నిలదీయగా చంపుతానని బెదిరిస్తున్నాడని అనంతసాగరానికి చెందిన ఓ వ్యక్తి వినతిపత్రం ఇచ్చాడు.
- నా భర్త మరణించాడు. అత్తింటివారు ఆయన ఆస్తి ఇవ్వకుండా వేధిస్తున్నారు. నాకు జీవనాధారం కష్టమైంది. అవస్థలు పడుతున్నానని కొండాపురానికి చెందిన ఓ మహిళ అర్జీ సమర్పించారు.
- నా కుమార్తె ఈనెల రెండో తేదీ నుంచి కనిపించడం లేదు. మా మండలానికి చెందిన ఓ యువకుడిపై అనుమానం ఉంది. విచారించి కుమార్తె ఆచూకీని తెలియజేయాలని లింగసముద్రంకు చెందిన ఓ మహిళ కోరారు.
- నాకు ముగ్గురు కుమారులు. నా పేరుపైనున్న ఆస్తులు పంచాలని కొడుకులు, కోడళ్లు వేధిస్తున్నారు. తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని నెల్లూరు రూరల్ పరిధికి చెందిన ఓ వృద్ధురాలు ఫిర్యాదు చేశారు.
- నెల్లూరుకు చెందిన పృథ్వీరాజ్‌తో నాకు వివాహమైంది. అతను వ్యసనాలకు బానిసై అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని తమిళనాడుకు చెందిన ఓ మహిళ వినతి పత్రమిచ్చారు.
- నా భర్త చెన్నైలో పనిచేస్తున్నాడు. ఇద్దరు ఆడపిల్లలున్నారు. అతను మమ్మల్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడు. చెన్నైలో మరో వివాహం చేసుకున్నట్లు ఫొటోలు పంపాడు. విచారించి చర్యలు తీసుకోవాలని వెంకటాచలసత్రంకు చెందిన ఓ వివాహిత కోరారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.50
సన్నవి	రూ.30
పండ్లు	రూ.20

ఒక్క రాత్రిలోనే..

- సీజ్ చేసిన మైన్ నుంచి వైట్ క్వార్ట్జ్ తరలింపు
- రెవెన్యూ అధికారులకు సమాచారం
- దీంతో ఆగిన తంతు

పొదలకూరు: సీజ్ చేసిన అటవీ భూముల్లోని వైట్ క్వార్ట్జ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు నాలుగురోజుల క్రితం రాత్రివేళ టిప్పర్లలో తరలించారు. ఈ ఖనిజానికి డిమాండ్ ఉంది. ఇక్కడ నాణ్యమైంది లభ్యమవుతుండటంతో జేసీబీతో నాలుగు టిప్పర్లలో లోడ్ చేసి తరలించారు. ఈ సమాచారం రెవెన్యూ అధికారులకు తెలియడంతో తిరిగి రాయిని తరలించే ప్రయత్నాన్ని వాయిదా వేసినట్లు తెలిసింది.

గతంలో మండలంలోని మొగళ్లూరు గ్రామానికి సమీపంలో ఉన్న అటవీ భూముల్లో మైనింగ్ చేస్తుండగా అధికారులు దాడులు నిర్వహించారు. వెలికితీసిన రాయితోపాటు, మైన్స్‌ను సీజ్ చేశారు. ఈ సమాచారాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. ఈ మైన్స్‌పై కేసులు కూడా నడుస్తున్నాయి. మైనింగ్ అధికారులు అప్పట్లో నోటీసులను సైతం అందజేశారు. అయితే మైనింగ్‌కు అలవాటు పడిన గూడూరు ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి ఇక్కడి నాణ్యత కలిగిన రాయిని వదులుకునేందుకు ఇష్టంలేక కొంతకాలంగా అక్రమంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. స్థానికంగా ఎవరూ సహకరించకపోవడంతో ఆ వ్యక్తి సాహసించలేకపోయాడు. నాలుగురోజుల క్రితం కొందరు ముందుకు రావడంతో ఒక్క రాత్రే ట్రెంచ్ కొట్టిన మైన్ వద్ద నున్న రాయిని తరలించాడు. ఆరోజు రాత్రి వర్షం కురిసిన నేపథ్యంలో కాపలా ఉన్న వారు ఇళ్లకు వెళ్లడంతో క్వార్ట్జ్‌ను తరలించేందుకు అనుకూలంగా మారినట్టు తెలిసింది. మరుసటిరోజు సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ మైన్ వద్ద కాపలాను కట్టుదిట్టం చేశారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.


మైన్ వద్ద తెల్లరాయి

నిఘా పెంచాం

వైట్ క్వార్ట్జ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు తరలించినట్టు సమాచారం అందిన వెంటనే ఆ ప్రాంతంలో నిఘా పెంచాం. తలారులను రాత్రి వేళ కూడా కాపలా ఉండాలని ఆదేశించాం. మైనింగ్ అధికారులకు సమాచారం అందజేయడం జరుగుతుంది.

– బి.శివకృష్ణయ్య, తహసీల్దార్, పొదలకూరు

కారు బోల్తా పడి..

- వృద్ధుడి మృతి, ముగ్గురికి గాయాలు

దగదర్తి: మండలంలోని సున్నపుబట్టి సమీపంలో అటవీ ప్రాంతం వద్ద హైవేపై సోమవారం కావలి వైపు వేగంగా వెళ్తున్న కారు బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతిచెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. బెంగళూరు నుంచి తెనాలికి కారులో రత్నరాజు, అతని భార్య విజయకుమారి, కోడలు సుహాసిని, అల్లుడు వంశీ ప్రయాణిస్తున్నారు. వంశీ వాహనం నడుపుతున్నాడు. అటవీ ప్రాంతం వద్దకు రాగానే కారు అదుపుతప్పి బోల్తా పడింది. రత్నరాజు (83) అక్కడికక్కడే మృతిచెందాడు. విజయకుమారి చేతికి తీవ్ర గాయమైంది. సుహాసిని, వంశీ స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు సహాయ చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హైవే అంబులెన్సులో నెల్లూరుకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జంపాని కుమార్ తెలిపారు.


రత్నరాజు మృతదేహం

35 బైక్‌లు, రెండు ఆటోల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు నగర డీఎస్పీ పి.సింధుప్రియ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి బోడిగాడితోట, అహ్మద్‌నగర్, బర్మాషెల్‌గుంట నాలుగు వైపులా దిగ్బంధించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. యజమానితోపాటు కుటుంబ సభ్యుల వివరాలను సేకరించారు. వాహనపత్రాలను పరిశీలించారు. పత్రాలు, నంబర్ ప్లేట్లు సక్రమంగా లేని 35 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకుని నవాబుపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నేరనియంత్రణ, అసాంఘిక కార్యక్రమాల కట్టడే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్డన్ సెర్చ్‌లకు ప్రజలు సహకరించాలని డీఎస్పీ కోరారు. ప్రజలు తమవంతు బాధ్యతగా అనుమానాస్పద వ్యక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలు, మత్తు పదార్థాల వినియోగంపై డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సెర్చ్‌లో నవాబుపేట ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీస్ అధికారులు

వ్యక్తి బలవన్మరణం

అనుమసముద్రంపేట: కుటుంబ కలహాలో, ఇతర కారణాలో తెలియదు గానీ ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని చిరమన గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు కథనం మేరకు.. గ్రామానికి చెందిన మాలకొండయ్య (45) మద్యంలో పురుగు మందు కలిపి తాగి ఇంటికొచ్చాడు. ఈ విషయాన్ని తన తల్లికి చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆత్మకూరు జిల్లా వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందాడు. మృతదేహాన్ని అక్కడికి తీసుకెళ్లగా వైద్యులు పోస్టుమార్టం నిర్వహించలేదని కుటుంబ సభ్యులు మీడియా ముందు వాపోయారు. ఆస్పత్రి సిబ్బంది, పోలీసులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

బాలుడి అదృశ్యం.. డ్రోన్‌తో వెతుకులాట

నెల్లూరు సిటీ: ఒకటో తరగతి చదువుతున్న బాలుడు అదృశ్యమవగా ఏడు గంటల్లోనే పోలీసులు ఆచూకీ కనుకున్నారు. వారి కథనం మేరకు.. రూరల్ మండలంలోని పాతవెల్లంటి గ్రామంలో పాదర్తి నారాయణ, రమణమ్మ దంపతులకు మనోజ్ అనే కుమారుడు ఉన్నాడు. సోమవారం కుమారుడు అల్లరి చేస్తున్నాడని తండ్రి మందలించాడు. ఇంట్లో తల్లిదండ్రులు ఎవరి పనిలో వారుండగా మనోజ్ వీధిలోకి వెళ్లాడు. ఆడుకోవడానికి వెళ్లి ఉంటాడని తొలుత భార్యాభర్తలు భావించారు. అయితే ఎంతకీ ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెంది రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో కలిసి వెతకడం మొదలుపెట్టారు. డ్రోన్‌ను ఉపయోగించి ఆ ప్రాంతంలో జల్లెడ పట్టారు. పక్కవీధిలోని ఇంటి మిద్దెపై ఉన్నట్లు గుర్తించారు. మనోజ్ డ్రోన్‌ను చూసి ఆ శబ్దానికి కిందకు దిగాడు. ఆచూకీ లభ్యం కావడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.


మనోజ్‌తో సీఐ వేణు, తల్లిదండ్రులు, గ్రామస్తులు

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

- వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు ప్రశాంతి నగర్‌లో శ్రీనివాసులు (55) కుటుంబం నివాసం ఉంటోంది. అతను కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈనెల తొమ్మిదో తేదీ రాత్రి గడ్డిమందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి నారాయణ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతిచెందాడు. బాధిత కుటుంబ సభ్యులు సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీలారీ కింద పడి ఆవు మృతి

ఉదయగిరి రూరల్: మినీలారీ కింద పడి ఆవు మృతిచెందిన ఘటన సోమవారం జరిగింది. స్థానికుల కథనం మేరకు.. గండిపాళెం వైపు నుంచి ఉదయగిరి పట్టణంలోకి మినీలారీ వస్తోంది. పెట్రోల్ బంక్ సమీపానికి వచ్చేసరికి రెండు ఆవులు పోట్లాడుకుంటూ దాని కింద పడ్డాయి. ఒక ఆవు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకటి ఇరుక్కుపోయి గాయపడింది. స్థానికులు గుర్తించి బయటకు తీసి రక్షించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.


ఆవును బయటకు తీస్తున్న స్థానికులు

ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ నేడు

నెల్లూరు రూరల్: జిల్లాలో 1 – 19 సంవత్సరాల మధ్య వయసున్న వారికి నులిపురుగుల నివారణ మాత్రలను తప్పకుండా అందించాలని కలెక్టర్ ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో ఆదేశించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఆల్బెండాజోల్ మాత్రలను పంపిణీ చేయాలన్నారు. జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు.

పూరిల్లు దగ్ధమై ఆస్తి నష్టం

మనుబోలు: పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని నాయుడు పాళెం గ్రామంలో సోమవారం జరిగింది. బాధితుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రావూరు సుబ్బారాయుడు, వెంకటరమణమ్మ దంపతులు ఇంటికి తాళం వేసి పని నిమిత్తం వెంకటాచలం మండలం కురిచెర్లపాడుకు వెళ్లారు. తిరిగొచ్చేలోపు పూరింటి పైనున్న 11 కేవీ ఎల్‌టీ లైన్ వైర్లు ఒకదానికొకటి రాసుకుని నిప్పురవ్వలు ఇంటిపై పడి మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలను ఆర్పాలని ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. పొదలకూరు నుంచి వచ్చిన ఫైరింజిన్ మంటలను ఆర్పినా అప్పటికే నష్టం జరిగిపోయింది. ఇంట్లో ఉన్న రూ.2 లక్షల నగదు, మూడున్నర సవర్ల నల్లపూసల దండ, రెండు ఉంగరాలు, రెండు పుట్ల ధాన్యం అగ్నికి ఆహుతయ్యాయి. నిత్యావసర వస్తువులు, దుస్తులు, 100 కేజీల బియ్యం కాలిపోవడంతో ఆ కుటుంబం వీధిన పడింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


కాలిపోయిన వస్తువులు

గంజాయి మత్తులో దాడి

ఆత్మకూరు: పట్టణంలో గంజాయి సేవించే యువకుల సంఖ్య పెరిగింది. దళితకాలనీకి చెందిన గౌరీశంకర్ అనే యువకుడు గంజాయికి బానిసై పలువురితో గొడవలు పడుతుంటాడని స్థానికులు తెలిపారు. సోమవారం కాలనీకి చెందిన మరో యువకుడు హేమంత్‌ను మాట్లాడేందుకు అతను పిలిచాడు. ఇద్దరూ పాత ఆంధ్రా బ్యాంక్ ఎదురుగా ఉన్న సందులో మాట్లాడుకుంటున్నారు. ఒక్కసారిగా గౌరీశంకర్ హేమంత్‌ను తిడుతూ దాడికి పాల్పడి పారిపోయాడు. హేమంత్ తన బంధువులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా శంకర్‌ను వారు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	రూ.115
లేయర్	రూ.115
బ్రాయిలర్ చికెన్	రూ.212
స్కిన్‌లెస్ చికెన్	రూ.234
లేయర్ చికెన్	రూ.195

ప్రో కబడ్డీ రెఫరీగా శ్రీనివాసరావు

ఉలవపాడు: యువ ఆంధ్ర ప్రో కబడ్డీ సీజన్-1 రెఫరీగా కరేడు గ్రామానికి చెందిన సాదం శ్రీనివాసరావు ఎంపికైనట్లు ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఈనెల 15 నుంచి 25వ తేదీ వరకు విజయవాడలో జరిగే సీజన్-1లో రిఫరీగా వ్యవహరిస్తారన్నారు. ఆంధ్ర కబడ్డీ రిఫరీస్ బోర్డు నుంచి ఎంపిక చేసినట్లు తెలిపారు. అసోసియేషన్ రెఫరీస్ బోర్డు చైర్మన్ మురళీకుమార్, కన్వీనర్ రవీంద్ర, ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, సెక్రటరీ పూర్ణచంద్రరావులకు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.


శ్రీనివాసరావు

సెంట్రింగ్ పని చేస్తుండగా..

- నాలుగో అంతస్తు నుంచి పడి యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): సెంట్రింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగో అంతస్తు నుంచి కిందపడి ఓ యువకుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు రూరల్ మండలం అక్కచెరువుపాడులో నాగేంద్రబాబు (28), దీపావర్షిణి దంపతులు నివాసం ఉంటున్నారు. నాగేంద్రబాబు సోమవారం ఇస్కాన్‌సిటీలో నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్‌లో నాలుగో అంతస్తులో సెంట్రింగ్ పనికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్రగాయాలపాలైన అతడిని అక్కడున్న వారు అపోలో హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటికే మృతిచెందారు. మృతుడి తల్లి శేషమ్మ దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.